క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర నక్షత్రం పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అలంకరించి అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరం అని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక భాష్యం ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంట్రా స్పోర్ట్స్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జడ్జి, మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ గౌడ్‌తో కలిసి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అకాడమిక్స్‌తో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉండటం వల్ల మానసిక వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ పోటీల్లో కర్నూలు, నంద్యాల జిల్లాలోని భాష్యం స్కూల్స్ కె1, కె2, కె3, కె4 విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. సీఈఓ అనీల్, ప్రిన్సిపాళ్లు శ్రావణ్, రాంప్రసాద్, కుసుమ, రమ, సాయినాథ్, హలీమా తదితరులు ఉన్నారు.

సోదరభావంతో మెలగాలి



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

బేతంచెర్ల: హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలని ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని షాదీఖానాలో శివ గురుస్వామి నారాయణ స్వామి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మసం పురస్కరించుకొని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ సీడ్స్ చైర్మన్ స్వయంగా ఆహారం వడ్డించారు. పట్టణ వాసులు, ముస్లింలు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ



బీరువా పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

ప్యాపిలి: మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానిక పెట్రోల్‌బంకు వద్ద నివాసం ఉంటున్న గోనవరం ప్రసాద్ ఇంటి తలుపులు పగులగొట్టిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. బీరువా పగులగొట్టి అందులో ఉన్న వస్తువులను, చీరలను కిందికి పడేశారు. బీరువాలో ఉంచిన నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుస్తోంది.

ఇంటి యజమాని ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి కంటి ఆపరేషన్ నిమిత్తం నంద్యాలకు వెళ్లాడు. చోరీ జరిగిందన్న సమాచారం తెలుసుకున్న వెంటనే జలదుర్గం ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడు నంద్యాల నుంచి వచ్చిన తర్వాత ఎంత మొత్తం చోరీ జరిగిందన్న విషయం తెలుస్తుందని ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని నందివర్గం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ఊసల్ల ఉమామహేశ్వరి అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన రంగస్వామి కూతురు ఉమామహేశ్వరి పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈనెల 13న కళాశాలలో పరీక్ష ఉందని వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అడుగంటిన కుందరవాగు

ఎండుతున్న పంటలు

- పంట చేతికందే తరుణంలో సాగునీటి కష్టాలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



నీరు లేక అడుగంటిన కుందరవాగు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులను అధిక వర్షాలు, తుఫాన్లు వెంటాడగా రబీ సీజన్‌లో సాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. కుందరవాగు పరివాహక ప్రాంతాల్లో రబీలో వివిధ రకాల పంటలు సాగుచేయగా పైర్లు చేతికందే తరుణంలో సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల– భీమునిపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందరవాగులో ఇటీవల నీరు అడుగంటిపోయింది. వాగు నీటి ఆధారంగా ఆయా గ్రామాల రైతులు సుమారు 500 ఎకరాల్లో వరి, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. వరి నార, నాట్లు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపునివారణ, తదితర పెట్టుబడుల రూపంలో రైతులు ఇప్పటికే ఎకరాకు రూ. 20 వేలు వెచ్చించగా పైరు 50 రోజుల దశలో ఉంది. మొక్కజొన్నలో ఎకరాకు రూ. 20 వేలు పెట్టుబడుల రూపంలో పెట్టగా పైరు 40 రోజుల దశకు చేరుకుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మిరపలో చివరి కోతలు మిగిలి ఉన్నాయి. ఈ తరుణంలో కుందరవాగు ఎండి పోవడంతో పైర్లకు సాగునీరు అందటం లేదు. మొక్కజొన్న, మిరపకు మరో రెండు, మూడు నీటి తడులు అవసరం కాగా వరికి మరో నెల రోజులపాటు సాగునీరు అందాల్సి ఉంది. వాగులో చుక్క నీరు లేకపోవడంతో పది రోజుల నుంచి పైర్లకు సాగునీరు అందటం లేదని రైతులు వాపోతున్నారు. కేసీ కెనాల్ 16వ లాక్ నుంచి కుందరవాగు నీటిని విడుదల చేయకపోతే పైర్లు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల రూపంలో ఇప్పటికే వేలాది రూపాయలు వెచ్చించామని పైర్లు చేతికందే దశలో సాగునీరు అందకపోతే పెట్టుబడులు వృథా అయి నష్టాల ఊబిలో కూరుకపోతామని రైతులు దిగాలు చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కేసీ కెనాల్ నుంచి వాగుకు సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



సాగునీరందక ఎండిపోతున్న వరి



వాడుపట్టిన మిరప పంటలు

పంటలు ఎండిపోతున్నాయి



ఎకరా రూ. 40 వేలు కౌలు చెల్లించి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేశాను. నార, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సాగునీరు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 1.50 లక్షలు వెచ్చించాను. మొదట్లో అధిక వర్షాలతో తెగుళ్లు సోకి దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. ప్రస్తుతం పైరు చివరి కోత దశలో ఉంది. కుందరవాగు ఎండిపోయి సాగునీరు అందకపోవడంతో చివరి కోతలు చేతికందే పరిస్థితులు కన్పించడం లేదు.

– మోహన్‌రెడ్డి, రైతు, కంపమల్ల

ఏడు ఎకరాల్లో వరి సాగు చేశాను



ఎకరాకు రూ. 10 బస్తాలు వడ్లు కౌలు రూపంలో చెల్లించేలా ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎరువులు, పురుగు మందులు, కలుపు తీయడం వంటి పనులకు ఎకరాకు రూ. 34 వేలు ఖర్చు చేశాను.

ప్రస్తుతం పైరు 55 రోజుల దశలో ఉంది. మరో నెల రోజులపాటు సాగునీరు అందితే తప్ప పైరు చేతికందదు. సాగునీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

–ప్రతాప్‌రెడ్డి, రైతు, భీమునిపాడు

సాగునీటిని విడుదల చేయాలి



కుందరవాగు ఎండిపోవడంతో పైర్లు చేతికందే తరుణంలో సాగునీరు అందటం లేదు. ఎకరా రూ. 20 వేలు కౌలు చెల్లించి ఐదు ఎకరాల్లో వరి, మరో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేశాను. పైరు రెండు నెలల దశలో ఉన్నాయి. పైర్లకు మరో నెల రోజులపాటు సాగునీటిని మళ్లించాల్సి ఉంది. వాగు ఎండిపోయి సాగునీటి కొరత ఏర్పడింది. అధికారులు చర్యలు తీసుకుని కేసీ కెనాల్ నుంచి కుందరవాగుకు నీటిని విడుదల చేయాలి.

– సంజీవరెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

వినియోగదారుల్లో చైతన్యం తేవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమాజంలో ప్రతి వ్యక్తిని చైతన్య పరచి వారిలో జాగృతి కలిగించాలని తహసీల్దార్ నాగమణి సూచించారు. ఆమె స్థానిక కార్యాలయంలో వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజులతో కలిసి శుక్రవారం వినియోగదారుల చైతన్య కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో వారం రోజుల పాటు ప్రజలను చైతన్యం కల్గించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకుంటే వస్తువు సేవల్లో లోపం తలెత్తితే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించి నష్ట పరిహారం పొందవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

డోన్ టౌన్: పట్టణ శివారు ప్రాంతాలైన వైఎస్ నగర్, నల్లగుట్ట ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, పట్టణ కమిటీ సభ్యుడు శివరామ్, హరి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఆయా కాలనీల్లోని వార్డులో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డోన్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యి 20 సంవత్సరాలు అయినా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గుంతలమయమైన రోడ్లపై రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి కాలనీగా ఉండటం వల్ల దొంగల భయం అధికంగా ఉందన్నారు. అలాగే కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని లేని పక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, కుల్లాయప్ప, అశోక్, కేవీపీఎస్ నాయకులు రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



చెన్నకేశవ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయంలో పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు నాగరాజుయాదవ్, లక్ష్మిదేవి దంపతులు, భక్తులు, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేదపండితులు నరేష్ శర్మ వేద మంత్రాలు చదవుతూ, మంగళవాయిద్యాల మధ్యన శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవస్వామి కల్యాణం రమణీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయి పాల పండ్ల వృషభాల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. యువత ఈలలు, కేరింతల మధ్య బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి.

ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె రూరల్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహరించాలని సీఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో వ్యాపార దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వ్యాపారులు సరకులను వాహనాల్లో దుకాణాల వద్దకు తెచ్చుకుని లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు గంటల సమయం నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ పనులు రాత్రి 9 గంటల తరువాత, ఉదయం 8 గంటల్లోపు చేసుకోవాలని సూచించారు. జీఎం టాకీస్, ఆస్థానం రోడ్డు, పాతబస్టాండ్ ఏరియాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, పోలీసు సిబ్బం ఉన్నారు.

చెత్త కుప్పలు తొలగింపు



చెత్తకుప్పలను తొలగిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో చెత్తకుప్పలు దర్శనమిస్తుండడంతో ‘అంతా చెత్తమయం’ శీర్షికతో ‘సాక్షి’లో శుక్రవారం కథనం ప్రచురితమైనది. స్పందించిన పంచాయితీ కార్యదర్శి విక్రం గ్రామ ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోళ్లు

కోవెలకుంట్ల: మార్క్‌ఫెడ్ ద్వారా పప్పుశనగ కొనుగోళ్లకు ఆదేశాలు అందినట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.5,650 మద్దతు ధరతో రైతులు పంట ఉత్పత్తులను విక్రయించుకోవచ్చన్నారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో విక్రయ రిజిస్ట్రేషన్ చేసుకుంటే మార్క్‌ఫెడ్ ఏజెన్సీలైన డీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా శనగ దిగుబడులను కొనుగోలు చేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు, పసుపల గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

- డోన్ టౌన్: డోన్ పట్టణ సబ్ స్టేషన్‌లో సాధారణ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొండపేట, పాతపేట, చాకిరేవు మిట్ట, ఇందిరానగర్, కేఈ మాదన్న నగర్, పండరి నగర్, కురుకుందకాలనీ, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే జగదుర్తి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాయిత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.
- బేతంచెర్ల: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్ల పనుల వల్ల డ్రైవర్స్ కాలనీ, కోటపేట, గౌరిపేట, బైటిపేట కాలనీల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య శుక్రవారం తెలిపారు.

త్రీఫేజ్ కరెంటు వేళల మార్పు

డోన్ టౌన్: పట్టణంతో పాటు జగదుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం వ్యవసాయానికి త్రీ ఫేజ్ కరెంటు సరఫరా సమయంలో మార్పులు ఉంటాయని ఏఈ నాగేశ్వర రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. మండలంలోని జగదుర్తి, వెంకటనాయునిపల్లె, ఉడుములపాడు, తిమ్మాపురం, కామగానికుంట్ల, వెంకటాపురం, అబ్బిరెడ్డి పల్లె గ్రామాలకు శనివారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు సరఫరా ఉంటుందని రైతులు గమనించాలని ఆయన కోరారు.

జయప్రదం చేయండి

బేతంచెర్ల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న తిరుపతిలో జరగబోయే రాయలసీమ మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి, రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి, రామసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ మునిస్వామి, ఎద్దుల సుధాకర్, వెంకటేష్, రవి కుమార్, రామనాథం, శివుడు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవా శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలను అలంకరించి పల్లకీ సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అహోబిలంలో గంగుల తిమ్మ రెడ్డి మెమోరియల్ అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాసారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాగిన ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ఫణిక్రిష్ణారెడ్డి, గంగుల భరత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల్లో ఎడ్లు ఓ భాగమని, ఈ విషయం నేటి తరానికి తెలియజేయాలని ఏటా వృషభరాజుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడూ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండే రైతులకు ఎడ్ల పోటీలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, కేకే.నరసింహారెడ్డి తదితరులున్నారు

హోలీ సంబరాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తాండ, గోరుమానుకొండ తాండ గ్రామాలలో హోలీ పండుగ వేడుకలను తండావాసులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవతలైన సేవలాల్ మహారాజ్, మారెమ్మ దేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వేడుకలు జరుపుకున్నారు. తాండాలోని యువకులు ఈలలు కేరింతల మధ్య రంగులు చల్లుకొని గ్రామ పురవీధుల్లో సంబరాలు జరుపుకున్నారు. మహిళలు సాంప్రదాయ నృత్యం చేశారు. హోలీ పండుగ సందర్భంగా తరలివచ్చిన బంధువులతో గ్రామంలో సందడి నెలకొంది. చిన్నారులు సైతం రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులే కీలకం



పూత దశలో ఉన్న మామిడి పంట



మామిడి చెట్టుకు కాసిన పిందెలు



బి. కళ్యాణి

డోన్ రూరల్: నియోజకవర్గంలో మొత్తం 5,590 ఎకరాలలో రైతులు మామిడి పంటను సాగు చేశారు. మామిడి తోటలు ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మామిడిలో అధిక దిగుబడులు రావాలంటే యాజమాన్య పద్ధతులే కీలకమని ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి తెలిపారు. మామిడి రైతులకు సూచనలు, సలహాలు చేశారు.

మామిడిలో ప్రస్తుతం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు

మామిడి తోటలో డ్రిప్ సౌకర్యం ఉన్నచోట మూడు రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. కాలువల ద్వారా నీటి తడులు ఇచ్చే రైతులు 5 నుంచి 6 రోజులకు ఒకసారి తడులు ఇవ్వాలి. నేలలో తేమ శాతం ఎక్కువైనా, తక్కువైనా పిందె రాలిపోతుందని, తేమ ఎక్కువైతే తేనె మంచు పురుగు తీవ్రత పెరుగుతుంది. కాబట్టి పరిస్థితులకు అనుగుణంగా నీటి తడులు ఇవ్వాలని సూచించారు.

పిందెలు రాలకుండా తీసుకోవాల్సిన చర్యలు

మామిడి పిందెలు గోలికాయ సైజు నుంచి నిమ్మకాయ సైజు వచ్చే వరకు రాలిపోతూ ఉంటే వాటికి జింకు దాతు లోపం వల్లగాని, నేలలో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల అలా జరుగుతుంది. వీటి నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. అలాగే తామర పురుగు తొడిమను ఆశించడం, లద్దెపురుగు వలనగాని, మామిడి పిందెలు రాలిపోవడం జరుగుతుందని చెప్పారు.

నివారణ చర్యలు

పిందెలు చిన్న పరిమాణంలో ఉన్నప్పుడు పది గ్రాముల యూరియాను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పోటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం వల్ల పిందెలు రాలటం ఆగిపోయి వాటి నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. పొటాష్ ఎరువులను వేప పిండితో కలిపి చెట్లకు వేసుకోవాలి.

చీడ పీడల తాకిడిని అరికట్టాలి

మామిడి పిందె దశలో ఉన్నప్పుడు ముఖ్యంగా రసం పీల్చే పురుగులు, తేనెమంచు పురుగులు, పండు ఈగలు, బూడిద తెగులు, మచ్చల తెగులు వంటి వాటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. రసం పీల్చే పురుగుల నివారణకు 2 మిల్లీలీటర్ ఫిప్రోనిల్‌ను ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి. తేనే మంచు పురుగుకు 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు మూడు గ్రాముల గంధకాన్ని లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి. అలాగే పలు యాజమాన్య పద్ధతులు చేపట్టడం వల్ల మామిడి పంటలను కాపాడుకోవచ్చని అధికారులు సూచించారు.



వాహనాలు వెళ్లడంతో రహదారిపై దుమ్ము లేస్తున్న దృశ్యం

దుమ్ముతో అవస్థలు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు సుమారు రూ.650 కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గోరుమానుకొండ తాండ గ్రామస్తులు కోరారు. ప్రస్తుతం గోరుమానుకొండ, తాండ గ్రామ సమీపాన పనులు నత్తనడకన జరుగుతుండటంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు రవీంద్ర నాయక్, నాగేశ్వరరావు, గౌతమ్, వెంకటేష్, శంకర్, రాముడు, శ్రీను, దేవానాయక్ వాపోయారు. అలాగే సమీప మోడల్ స్కూలు, బీసీ రెసిడెన్సియల్ స్కూలు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దుమ్ము లేవకుండా నీరు చల్లాలని, పనులను వేగవంతం చేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.